మల్లారెడ్డి వర్సిటీలో హెల్త్‌కేర్ సైన్సెస్ కోర్సులు ప్రారంభం



హెల్త్‌కేర్ సైన్సెస్ కోర్సుల పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనివర్సిటీ వీసీ, హెచ్‌ఓడీలు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అలైడ్ హెల్త్ కేర్ సైన్సెస్ కోర్సులను ప్రారంభించినట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ వీఎస్‌కే రెడ్డి తెలిపారు. సోమవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెల్త్‌కేర్ కోర్సుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆసక్తి గల గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టరేట్ దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. మొదటిసారిగా యూనివర్సిటీలో పలు ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టినట్లు వివరించిన వీసీ యూజీ ప్రోగ్రామ్‌లో బీఎస్సీ నాలుగేళ్ల కోర్సు, అనస్థీషియా, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ తదితర వివిధ కోర్సులలో దరఖాస్తు చేసుకునేందుకు ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు అర్హులని వివరించారు. విద్యార్థుల ఉన్నత విద్యకు, ఉపాధి అవకాశాలకు ఈ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయని విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో యూనివర్సిటీలోని పలు విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శారీరక దారుఢ్యం, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

కీసర: క్రీడలు శారీరక దారుఢ్యంతోపాటు, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో మున్సిపల్ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేతరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పాల్గొనే యువత గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలన్నారు. వివిధ క్రీడా రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుడా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆర్‌జీకే కాలనీలోని యువతను క్రీడల్లో ప్రోత్సహించాలన్న మంచి ఉద్దేశంతో శ్వేతరాజు సొంతంగా క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు తోటకూర వజ్రేష్‌యాదవ్ బహుమతులను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు రామారావు, కౌన్సిలర్ వెంకటేష్, నర్మద పరశురాం తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని రక్షించాలని డీఎల్‌పీఓకు వినతి



పార్కు స్థలం కాపాడాలని డీఎల్పీఓకు వినతి అందజేస్తున్న అవుషాపూర్ వాసులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లోని న్యూసిటీ వెంచర్ పార్కు స్థలాన్ని రక్షించాలని డీఎల్‌పీఓ సాంబిరెడ్డికి ఆ గ్రామస్తులు సోమవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని సర్వేనంబర్ 253, 255, 256, 257, 261, 262, 263, 264 పార్ట్‌లోని భూమిలోని 70 ఎకరాల విస్తీర్ణంలో మూడు సెక్టార్లలో 600 ప్లాట్లు చేశారని, అందులో ప్రజా అవసరాల నిమిత్తం (పార్కు) 2400 గజాల స్థలాన్ని వదిలారని లేఖలో తెలిపారు. గతంలో పంచాయతీ అధికారులు అందులో హరితహారం మొక్కలు నాటారని, చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డు కూడా ఏర్పాటు చేశారన్నారు. కాగా రాజు అనే వ్యక్తి పార్కు స్థలాన్ని 2016లో విజయ ఎడ్యూకేషనల్ సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకొని ఆదివారం పనులు ప్రారంభించడంతో స్థానికులు అడ్డుకున్నారు. దీంతో స్థానికులు కొండల్‌రెడ్డి, బిక్షపతిగౌడ్, రమేశ్, మాధవరెడ్డి, జంగయ్య ముదిరాజ్, సందీప్‌రెడ్డి, వామన్‌రెడ్డి, వీరేశం, శ్రీనివాస్‌గౌడ్, దయాకర్‌రెడ్డి డీఎల్‌పీఓకు వినతి అందజేశారు.

మనుషులతో కలిసిమెలిసి...







కీసర పోలీస్‌స్టేషన్ ఆవరణలో మనుషుల వద్ద హాయ్‌గా నిద్రపోతున్న వానరం

కీసర పోలీస్‌స్టేషన్‌లో వానరం వింత ప్రవర్తన

కీసర: సహజంగా మనుషులను చూడగానే కోతులు మీదకు దూసుకురావడం, భయపడటం, కరవడం వంటివి చేస్తుంటాయి. కానీ గత మూడు రోజులుగా కీసర పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఉంటున్న ఓ కోతి చేస్తున్న చేష్టలను చూసి పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న వారు ఆశ్చర్యపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన బెంచీల వద్ద కూర్చుంటున్న మనుషుల వద్దకు అక్కడ ఉన్న ఓ కోతి వచ్చి వారి పక్కనే కూర్చొవడం, వారికి షేక్‌హ్యాండ్ ఇవ్వడం, తొడలపై హాయిగా నిద్రపోవడం చేస్తుండటం, ఏమైనా తినుబండారాలు ఇస్తే హాయ్‌గా తినడం చేస్తోంది. దీంతో కోతి ప్రవర్తిస్తున్న తీరును చూసి అక్కడి వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాగా గత మూడు రోజులుగా పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే కోతి ఉంటుంది. అయితే కోతి ఆరోగ్య పరిస్థితి ఏమైనా దెబ్బతిని ఉంటుందా అని కీసర పోలీస్‌స్టేషన్ సి.ఐ వెంకటయ్య స్థానికంగా ఉన్న వెటర్నరీ డాక్టర్‌తో కోతికి వైద్య పరీక్షలు సైతం నిర్వహించగా కోతి ఆరోగ్యకరంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఏది ఏమైనా కీసర పోలీస్‌స్టేషన్‌లో కోతి చేస్తున్న వింతలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

అంగరంగ వైభవంగా మల్లన్న స్వామి కల్యాణోత్సవం



మల్లిఖార్జున స్వామి కల్యాణోత్సవంలో శ్రీకాంత్‌యాదవ్, యాదవ సంఘం సభ్యులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్‌లోని శ్రీమల్లిఖార్జున స్వామి యాదవ సంఘం అధ్యక్షులు కసరవేణి యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో మల్లన్నస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం మల్లన్నస్వామి ఆశీస్సులు జవహర్‌నగర్ ప్రజలపై ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింహయాదవ్, వెంకటయ్యయాదవ్, సిద్దులుయాదవ్, కాయిత రాజు యాదవ్, రమేష్‌యాదవ్, రామరాజుయాదవ్, నరేష్‌యాదవ్, అశోక్‌యాదవ్, కృష్ణయాదవ్, వినయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్లను తొలగించరా..?



గోఖలేనగర్ రహదారిలో కూలిపోయిన చెట్టు

రామంతాపూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులు రామంతాపూర్‌లోని పలుబస్తీలు, కాలనీల్లోని అంతర్గత ప్రధాన రహదారుల్లో చెట్లు కూలిపోయాయి. దాదాపు నాలుగు రోజులు గడుస్తున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వర్షాలకు స్థానిక గోఖలేనగర్ రహదారిలో భారీ చెట్టు కూలిపోయింది. దాన్ని ఇంత వరకు తొలగించకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం అందించినా నిర్లక్ష్యంతో పట్టించుకోకపోవడం దారుణమని స్థానిక బీజేపీ సీనియర్ నేత నాను సతీష్ వాపోయారు. వెంటనే కూలిన చెట్లను తొలగించాలని ఆయన కోరారు.

ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య సేవలు!



పీహెచ్‌సీ, పల్లె, బస్తీ దవాఖానాల్లో దశలవారీగా ఆరు రకాల చికిత్సలు

- ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్
- జిల్లాలో మొదటి విడతలో 67 ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు
- ఎన్నికల కోడ్ ముగియగానే ప్రారంభించేందుకు చర్యలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ దవాఖానాలలో (ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్) ఇప్పటికే అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలతోపాటు మరిన్ని సేవలు విస్తరించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను కూడా పూర్తి చేసింది. సమీప వైద్య విధాన పరిషత్‌లో అనుసంధానం చేసే కసరత్తు కూడా జరుగుతోంది. త్వరలోనే ఈ వైద్య సేవలు అందుబాటులో తెచ్చేందుకు వీలుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

విడతల వారీగా..

ప్రస్తుతం అందుతున్న సేవలకు అదనంగా కంటిచూపు, ముక్కు, గొంతు, చెవి, దంత సమస్యలు, మానసిక సమస్యలు, ఎలర్జీ వంటి ఇతర అంశాలను చేర్చి వీటితో బాధపడే వారికి తగిన చికిత్స అందించనున్నారు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులకు నిపుణుల ద్వారా వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను విడతల వారీగా విస్తరించనున్నారు. మొదటి దశలో ప్రస్తుతమున్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్‌లో మూడో వంతు అంటే 67 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేకమైన ఈ ఆరు సేవలు ప్రజలకు త్వరలో అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. మొత్తంగా మూడు విడతల్లో ప్రత్యేక సేవలను విస్తరించనుండగా ప్రాథమిక వైద్య విధాన పరిషత్‌కు అనుసంధానం చేయటంతోపాటు వ్యాధికి సంబంధించిన వాటిని గుర్తించి తగిన వైద్యం అందించనున్నారు.

అవసరమైతే ఇతర ఆసుపత్రులకు..

ప్రజలకు వైద్యం విషయంలో వైద్య విధాన పరిషత్ వైద్యులు కూడా తోడ్పాటును అందించనున్నారు. అలాగే ప్రతీ నెలలో రెండు రోజులు ఆయా ఆసుపత్రులను సందర్శించి గుర్తించిన రోగులకు వైద్య చికిత్స అందేవిధంగా చూస్తారు. అవసరమైన వారిని సమీప జిల్లా ఆసుపత్రి, వైద్య విధాన పరిషత్‌కు పంపిస్తారు.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల వివరాలు

- జిల్లా ఆసుపత్రి: మల్కాజిగిరి (డీహెచ్)
- కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు : 04
- పీహెచ్‌సీలు : 12 (11 డెలివరీ పాయింట్స్)
- యూపీహెచ్‌సీఎస్ : 26 (6 డెలివరీ పాయింట్స్)
- 24 గంటల దవాఖానాలు : 12 (8 పీహెచ్‌సీఎస్, 5యూపీహెచ్‌సీఎస్)
- బస్తీ దవాఖానాలు : 112
- ఆరోగ్య ఉప కేంద్రాలు :103 (ఇందులో 70 పల్లె దవాఖానాలుగా అభివృద్ధి)

వైద్యులకు శిక్షణ పూర్తి..

మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న 103 ఆరోగ్య ఉప కేంద్రాల్లో 70 కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చారు. అలాగే, కొత్తగా 112 బస్తీ దవాఖానాలను కూడా పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకుచ్చారు. ప్రజలకు వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు ఎంబీబీఎస్ చదివిన వైద్యుడితో పాటు స్టాఫ్ నర్సును కూడా నియమిరచారు. వీటిని కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్లుగా నామకరణం చేసింది. ఈ ఆసుపత్రుల్లో మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధులకు చికిత్స అందిస్తూ అసంక్రమిత వ్యాధుల వారిన పడిన వారికి మాత్రలు అందజేస్తున్నారు. అక్కడ అందుబాటులో లేని వైద్య సేవలను సమీప జిల్లా కేంద్ర ఆసుపత్రి, సీఎంసీలకు తరలించి ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు.

ప్రజలకు ఎంతో ప్రయోజనం..

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్లలో వైద్య సేవలు విస్తరించడంతో బస్తీ, పల్లె ప్రజలకు వైద్యం మెరుగవుతోంది. ఈ ప్రత్యేక వైద్య సేవలు ప్రజలకు త్వరలోనే ప్రారంభం కానుంది. ఆరుకు పైగా సేవలు అందుబాటులోకి వస్తాయి. మా పర్యవేక్షణ ఉంటోంది. మూడు విడతల్లో సేవలను విస్తరించే అవకాశముంది.

– డాక్టరు.రఘునాథస్వామి, డీఎంహెచ్‌ఓ–మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా.

మీసేవ ద్వారా ధ్రువ పత్రాల జారీ సులభతరం

మీసేవ కమిషనర్ రవికిరణ్



సాక్షి,మేడ్చల్ జిల్లా: మీ–సేవ కేంద్రాల ద్వారా ధ్రువ పత్రాలను సులభతరంగా జారీ చేయడానికి అవసరమైన మార్పులు చేస్తున్నట్లు రాష్ట్ర మీ–సేవ కమిషనర్ రవి కిరణ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండల పరిధిలో మీ–సేవ ద్వారా జారీ చేసే వివిధ ధ్రువ పత్రాలు జారీ చేసే ప్రక్రియలో ఏర్పడుతున్న ఇబ్బందులకు సంబంధించిన పలు సమస్యలను మండలాల తహసీల్దార్లు ఈ సందర్భంగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ మీ–సేవ ద్వారా జారీ చేసే ధ్రువపత్రాలు సులభతరంగా జారీ చేయడానికి మార్పులు,చేర్పులు చేయడం జరుగుతుందని కమిషనర్ రవి కిరణ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, మండల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మల్కాజిగిరి: బండ చెరువు కింది ప్రాంతాల్లో ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని షిరిడీనగర్, కళ్యాణ్‌నగర్, సీఫెల్ కాలనీ ప్రతినిధులు, కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. షిరిడీనగర్, కళ్యాణ్‌నగర్, సీఫెల్‌కాలనీలో అసంపూర్తిగా ఉన్న బాక్స్ డ్రైన్ పనులు పూర్తి చేస్తే ముంపు సమస్య తీరుతుందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే కాలనీవాసులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దామని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కలుషిత నీటితోనే చేపలు మృత్యువాత



ఎదులాబాద్ చెరువును పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీలక్ష్మీనారాయణ చెరువులోని కలుషిత నీటితోనే వేలాది చేపలు మృత్యువాత పడ్డాయని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల క్రితం కలుషిత నీటితో మృతి చెందిన ఎదులాబాద్ చెరువును మాజీ సర్పంచ్ మూసీ శంకరన్నతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రసాయన వ్యర్థాలు చెరువులో కలవడంతో నీరు కలుషితమైందన్నారు. చెరువులోకి కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో చేపలతో పాటు రానున్న రోజుల్లో ప్రజలకు కూడా రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, సురేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప కల్యాణ మహోత్సవం



బీరప్ప ఆలయంలో తోటకూర వజ్రేశ్‌యాదవ్, నాయకులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని శ్రీ బీరప్ప కామరాతి దేవి ఆలయంలో స్వామి వారి జాతర మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరప్ప– కామరాతి దేవి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఒగ్గు పూజారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కురుమ సంఘం నాయకులు నాయకులు వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. వేడుకల్లో కౌన్సిలర్లు కొడె మహేశ్, స్వామి యాదవ్, శివకుమార్‌యాదవ్, చాపరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమేశ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, రాఘవేందర్‌గౌడ్, రంజిత్, రేగు రాజు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరిలో బీజేపీ గెలుపు ఖాయం



గాజులరామారం డివిజన్ ముఖ్య నాయకుల సమావేశంలో కార్పొరేటర్ రావుల శేషగిరి

సుభాష్‌నగర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోబోతుందని... పార్టీ కార్యకర్తలు పడిన శ్రమ వృథా కాబోదని బీజేపీ నాయకుడు రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం గాజులరామారంలో జరిగింది. ఈ సందర్భంగా రావుల శేషగిరి మాట్లాడుతూ... ఇటీవల ముగిసిన మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయానికి కృషి చేశారన్నారు.

- కార్యకర్తలు పడిన శ్రమకు తగ్గ ఫలితం జూన్ 4న వెలువడనుందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అధిష్టానం తగు గుర్తింపు ఇస్తుందన్నారు. కార్యకర్తల కృషి అయోఘమన్నారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత, రాష్ట్ర యువ మోర్చా మీడియా కన్వీనర్ రేవతిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సునీల్‌పాటిల్, డివిజన్ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, నాయకులు సింగారం మల్లేష్, ప్రభాకర్‌రెడ్డి, మురళి, బూత్ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పోచారం: కరెంట్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను కొట్టివేస్తున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. అన్నోజిగూడ ఫీడర్ పరిధిలోని ఎల్‌ఎస్ కాలనీ, ఎల్‌ఐజీ టౌన్‌షిప్, అన్నోజిగూడ, జైపురి కాలనీ, సత్యానగర్, సాయినగర్, ఇందిరానగర్ ప్రాంతాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆర్జీకే ఫీడర్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీ, ఆర్‌ఎస్‌ఆర్ హైట్స్, మయూరీ డెవలపర్స్, సాయినగర్, ఎమరాల్డ్ హైట్స్, సూర్యనగర్ ప్రాంతాలకు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, పోచారం ఫీడర్ పరిధిలోని పోచారం గ్రామం, డాక్టర్స్ కాలనీ, విజయ సాయి ఎన్‌క్లేవ్ ప్రాంతాలకు మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

27 తేదీలోగా అతిథి ఉపాధ్యాయులకు దరఖాస్తులు చేసుకోవాలి

కీసర: కీసరగుట్టలోని తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ మధునాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందన్నారు. విద్యార్హతలు అనుభవం కలిగినవారు ధృవీకరణ పత్రాలతో ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఆంగ్లం, గణితం, సామాన్య, భౌతిక, వృక్ష , జంతు, సాంఘిక శాస్త్రంలో పీజీ, బీఈడీ తత్సమానమైన విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9866559681 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఐటీఐలో పలు కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్: మేడ్చల్‌లోని పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాలలో పలు కోర్సులలో చేరేందుకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ సోమవారం ఒక ప్రటకన ద్వారా తెలిపారు. కళాశాలలో ఏడాది, రెండేళ్ల కోర్సులకు చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 16 నుంచి జూన్ 10 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు సమయంలో విద్యార్థులు కళాశాల ఎంపిక, చదివే కోర్సు, విద్యార్థి వివరాలు, మొబైల్ నెంబర్ సరిగ్గా ఉండేలా చూసుకుని దరఖాస్తు చేయాలని సూచించారు.

ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్ రమేష్

జవహర్‌నగర్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గోవా ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించిన మెగా ఇంటర్నేషనల్ ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో జవహర్‌నగర్‌కు చెందిన విద్యార్థులు వైష్ణవి, అరుణ్‌తేజ్ బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా రణ్‌వీర్ తైక్వాండో అకాడమీ మాస్టర్ రమేష్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌తోనే ఆత్మ రక్షణతోపాటు, మానసిక ప్రశాంతత కలుగుతుందని, విద్యార్థులు చిన్నప్పటి నుంచే మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయాలని తెలిపారు. ఈ మేరకు పతకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్ రమేష్, జవహర్‌నగర్ ప్రజలు అభినందించారు.